సాక్షి
అనకాపల్లి
గురువారం ॥ 6 ॥ జూలై ॥ 2023

న్యూస్‌రీల్

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సెలింగ్

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఆర్‌సీఎం మేనేజ్‌మెంట్ పరిధిలోని ఎయిడెడ్ స్కూళ్లలో బోధన, బోధనేతర సిబ్బందిని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో సర్దుబాటు కోసం బుధవారం డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో పనిచేస్తున్న వారిని సర్దుబాటు చేయగా, సెకండరీ గ్రేడ్ టీచర్లు 23 మంది, బోధనేతర సిబ్బంది 10 మంది, క్రాఫ్ట్ టీచర్ ఒకరు, డ్రాయింగ్ టీచర్ ఇద్దరికి కౌన్సెలింగ్ ద్వారా ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని స్కూళ్లలో సర్దుబాటు చేశారు. ఆర్‌సీఎం మేనేజ్‌మెంట్ తమ పరిధిలోని పాఠశాలలకు ప్రభుత్వ ఎయిడ్‌ను వదుకుంటున్నట్లు ఇప్పటికే సమ్మితి పత్రాన్ని అందజేసింది. ఈ నేపథ్యంలో ఇక్కడి విద్యార్థులను సమీపంలో గల వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ప్రభుత్వం ద్వారా వేతనాలు పొందుతున్న బోధన, బోధనేతర సిబ్బంది మొత్తం 52 మందిని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లోకి తీసుకున్నారు. కాగా వీరిలో కొంతమంది ఉపాధ్యాయుల సర్వీసు పరమైన ఆరోపణలు, విజిలెన్స్ విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. వీరి విషయంలో తదుపరి చర్యలు ఎలా ఉంటాయనేది ఉపాధ్యాయుల్లో చర్చసాగుతుంది.

వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చొక్కాకుల



విశాఖ విద్య: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విశాఖపట్నానికి చెందిన చొక్కాకుల సూర్యనారాయణ ఎన్నికయ్యారు. బుధవారం ప్రకటించిన రాష్ట్ర కమిటీలో చొక్కాకుల సూర్యనారాయణకు స్థానం దక్కింది. ఆయన ప్రస్తుతం వైఎస్సార్ టీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షుడు వి జయసాయిరెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల పక్షాన నిలిచి, వారి సర్వీసు పరమైన సమస్యల ను పరిష్కరించటంలో చొక్కాకుల తనదైన శైలిలో పనిచేస్తున్నారు. వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకత్వం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు తీసుకెళ్తూ, సమస్యలకు పరిష్కారం చూపటం ద్వారా విశాఖ జిల్లాలో సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చొక్కాకుల రాష్ట్ర కమిటీలో చోటు కల్పించారు.

ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్‌లో డాక్‌యార్డు ఉద్యోగికి 5వ స్థానం

- ఫ్రాన్స్‌లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించిన ఉజ్వల్ చౌధురి



విజయం సాధించిన ఉజ్వల్ చౌధురి

సాక్షి, విశాఖపట్నం : కజికిస్తాన్‌లో జరిగిన ఐరన్‌మ్యాన్ ట్రయథ్లాన్‌లో నేవీ అనుబంధ సంస్థ నేవల్ డాక్‌యార్డు ఉద్యోగి అత్యుత్తమ ప్రతిభని కనబరిచారు. జూలై 2న జరిగిన పోటీల్లో ట్రయథ్లాన్‌ని 11 గంటల 4 నిమిషాల్లో ముగించిన డాక్‌యార్డు లెఫ్టినెంట్ కమాండర్ ఉజ్వల్ చౌధురి ఐదో స్థానంలో నిలిచారు. ఈ రేసులో 3.8 కిమీ స్విమ్మింగ్, 180 కిమీ సైక్లింగ్, 42.2 కిమీ మారథాన్‌ని 11 గంటల్లో పూర్తి చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ పోటీల్లో 400 మంది పాల్గొనగా.. భారత్‌కు చెందిన 50 మంది పాల్గొన్నారు. ఇండియా తరపున నంబర్‌వన్‌గానూ, వరల్డ్ టాప్-5లో చోటు సాధించి.. త్వరలో ఫ్రాన్స్‌లో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌కు ఉజ్వల్ చౌధురి అర్హత సాధించారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్ - కటక్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. హైదరాబాద్-కటక్(07165) స్పెషల్ హైదరాబాద్‌లో (ప్రతీ మంగళవారం) రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.07 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు ఈనెల 4,11,18,25 తేదీల్లో నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కటక్-హైదరాబాద్(07166) స్పెషల్ కటక్‌లో (ప్రతీ బుధవారం) రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.37 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు ఈనెల 5, 12, 19, 26 తేదీల్లో నడుస్తుంది.

మగ్గానికి మంచి రోజులు

- నేతన్నకు జగనన్న నేస్తం
- ఏడాదికి రూ.24 వేలు జమ
- ఐదో విడత పంపిణీకి సర్వం సిద్ధం



నేతన్న సాయం కోసం మగ్గం కార్మికుల సర్వే నిర్వహిస్తున్న అధికారులు



నక్కపల్లిలో వస్త్రాలు నేస్తున్న నేతన్నలు

నక్కపల్లి: జగనన్న ఇచ్చిన భరోసాతో చేనేత రంగానికి పూర్వ వైభవం వచ్చింది. నేతన్న తలరాతలు పూర్తిగా మారాయి. మగ్గాలకు మహర్దశ వచ్చింది. నేతన్న నేస్తం పథకంలో వరుసగా ఐదో విడత ఆర్థిక సాయం జమ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెలలోనే ఈ నగదు సాయం నేరుగా నేతన్నల ఖాతాల్లో జమ కానుంది. ఈ పథకానికి సంబంధించి లబ్ధిదారుల పరిశీలన చురుగ్గా జరుగుతోంది.

నిరాటంకంగా...

ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు విజయనగరం జిల్లాలో అధికంగా చేనేత కార్మికులు ఉన్నారు. ఈ ప్రాంతాల్లో ఉన్న మగ్గాలపై వస్త్రాల తయారీ ఎక్కువ. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మగ్గం కలిగిన కుటుంబానికి నెలకు రూ.2 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తానని బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019 అక్టోబరులో మొదటి విడత నిధులు విడుదల చేశారు. రెండోవిడత సాయాన్ని 2020 జూన్ 20న, మూడోవిడత సాయాన్ని 2021 జూన్ 10న, నాలుగో విడత ఆగస్టు 2022లో జమ చేశారు. నెలకు రూ.2 వేల చొప్పున ఏడాది నగదు రూ.24వేలు ఒకే విడతలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. నాలుగేళ్లనుంచి ఈ సాయం నిరాటంకంగా అందుతోంది. కరోనా సంక్షోభ సమయంలో కూడా నేతన్నలను ఆదుకున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనంటూ చేనేత కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

అనకాపల్లి జిల్లాలో 250 మందికి లబ్ధి

ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల్లో సుమారు 979 మంది మగ్గం కలిగిన చేనేత కార్మికులు ఉన్నారు. వీరంతా మగ్గంపై వస్త్రాలు నేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

జిల్లాలో సుమారు 60 వేల మంది చేనేత కార్మికులు ఉన్నారు. జిల్లాలో చోడవరం, వేములపూడి, నక్కపల్లి, గొడిచర్ల, బంగారయ్యపేట, గొడిచర్ల, పాయకరావుపేట, బూరుగుపాలెం, నర్సీపట్నం, కోటవురట్ల, గుండుపాల, రోలుగుంట, ఎ.కోడూరు, యలమంచిలి, ఎంబీ పట్నం, కొత్తపేట, సీహెచ్‌ఎల్‌పురం చేనేత సహకార సంఘాలున్నాయి. ఈ 17 సంఘాల్లో సుమారు 250 మందికి మాత్రమే మగ్గాలు ఉన్నాయి. విశాఖపట్నంలో నలుగురికి మగ్గాలున్నాయి. ఒక్క పాయకరావుపేట నియోజకవర్గంలోనే 120 మందికి పైగా మగ్గం కలిగిన కార్మికులు ఉన్నారు.

నక్కపల్లి, నర్సీపట్నం, కోటవురట్ల, కశింకోట, పాయకరావుపేట, మాకవారపాలెం మండలాల్లోనే ఎక్కువ మంది నేత కార్మికులు ఉన్నారు. ఇక విజయనగరం జిల్లాలో 725 లబ్ధిదారులు ఉన్నారు. ఐదో విడతకు సంబంధించి ఈ లబ్ధిదారుల పరిశీలన జరుగుతోంది. తుది జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపిస్తే త్వరలో నేతన్న నేస్తం పంపిణీ కార్యక్రమం ఉంటుందని చేనేత జౌళి శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

జగనన్నే మాకు నిజమైన నేస్తం



మగ్గం కలిగిన ప్రతి కుటుంబానికి నెలకు రూ.2 వేలు ఇస్తున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. నాలుగు విడతల సొమ్ము రూ.96 వేలు మా ఖాతాల్లో జమ అయింది. కరోనా సంక్షోభంలో కూడా జగనన్న మమ్మల్ని ఆదుకుని ఆర్థిక సాయం అందించారు. మళ్లీ జగనన్నే రావాలి.

– మాడెం అప్పలరాజు, నేత కార్మికుడు నక్కపల్లి

చురుగ్గా పరిశీలన

ఐదో విడత నేతన్న నేస్తం లబ్ధిదారుల పరిశీలన చురుగ్గా జరుగుతోంది. అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో కలిసి సుమారు 975 మంది లబ్ధిదారులు ఉంటారు. వీరందరి గుర్తింపు, మగ్గాల పరిశీలన కొలిక్కి వచ్చింది. ఈ నెలలో నేతన్న నేస్తం ఆర్థిక సాయం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే అవకాశాలున్నాయి. ఎప్పుడు అనేది ప్రభుత్వం త్వరలోనే ప్రకటిస్తుంది.

–మురళీకృష్ణ, ఏడీ, చేనేత జౌళి శాఖ, విజయనగరం

ఇంటి వద్దే ఉపాధి



రెండు రోజుల పాటు భార్యభర్తలిరువురం కష్టపడి ఒక చీర నేస్తే వచ్చే కూలి రూ.500. దీంతో ఎలా బతకాలి. అదే బయట పనులకు పోతే రూ.1500 సంపాదిస్తాం. కులవృత్తిని వదులుకోలేక ఇబ్బందులున్నా ఇదే పనిలో కొనసాగుతున్నాం. మా బాధలు చూసే దేవుడు వచ్చాడన్న ఆనందం కలిగింది. జగనన్న నెలకు రూ.2వేలు ఇస్తున్నాడు. నాలుగు విడతల సొమ్ము మా ఖాతాలో జమ కావడం ఆనందంగా ఉంది. ఇంటిపట్టునే కులవృత్తి చేసుకుంటూ హాయిగా జీవిస్తున్నాం.

– ఎం నాగరత్నం, నేత కార్మికురాలు, నక్కపల్లి

చంద్రబాబు వస్తే మళ్లీ అధోగతే..



జగనన్న రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది. నేతన్నలంతా జగనన్ననే నమ్ముకున్నాం. ఈ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలి. చంద్రబాబు సీఎం అయితే మళ్లీ మగ్గాలు మూసుకోవాల్సిందే.

– జి.బంగారాజు, నేత కార్మిక నాయకుడు

కులవృత్తికి జీవం పోసిన నేత



నేత కార్మికులను ఆదుకుని కులవృత్తిని కాపాడిన నాయకుడు జగనన్న. చతికిల పడిన చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చి వలసపోయిన నేతన్నలను తిరిగి మగ్గం బాట పట్టేలా చర్యలు తీసుకున్నారు. చంద్రబాబు హయాంలో చేనేత రంగం నిర్వీర్యమైంది. జగనన్న సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని నెలకు రూ.2 వేలు భృతి ప్రకటించి నాలుగేళ్ల నుంచి నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగనన్నే రావాలి.

–ఎల్లేటి సత్తిబాబు, చేనేత సామాజికవర్గనేత

21 నుంచి ఇంటింటికీ ఓటర్ల నమోదు

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



తుమ్మపాల: ఈనెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు ఇంటింటికీ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరుకు ఫొటో గుర్తింపుతో కూడిన స్పష్టమైన జాబితా సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణపై ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, బీఎల్‌వోలకు శిక్షణ ఏర్పాటు చేయాలన్నారు. భారత ఎన్నికల సంఘం 2014 జనవరి 1వ తేదీ నాటికి గల నిబంధనల మేరకు ఓటర్ల జాబితా సవరణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా జాబితా విడుదల చేయాలన్నారు. జాబితాలో వ్యత్యాసాల తొలగింపు, వయస్సు నిర్ధారణ వంటి అంశాలను సెప్టెంబర్ 5వ తేదీకి ముందే పూర్తి చేయాలన్నారు. ఆగస్టు 31వ తేదీ నాటికి పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సెప్టెంబర్ 9వ తేదీ నాటికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అక్టోబర్ 6 నుంచి 16వ తేదీ వరకు ముసాయిదా ఎన్నికల జాబితా సిద్ధం చేయాలని పేర్కొన్నారు. డిసెంబర్ 25వ తేదీకి దరఖాస్తుల అభ్యంతరాలు పరిశీలన, మార్పులు, చేర్పులు, తొలగింపు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. డీఆర్వో వెంకటమణ మాట్లాడుతూ జనాభా స్త్రీ, పురుష నిష్పత్తి బేరీజుతో ఓటర్ల జాబితా సిద్ధం చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాబితా సవరణలో అనుసరించాల్సిన విధి విధానాలను కుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరాం, 7 నియోజకవర్గాల అధికారులు పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్

- కప్, కరపత్రాల ఆవిష్కరణ

-8లో

ఫార్మా ప్రమాదంపై విచారణ

- సాహితి ఫార్మా కంపెనీని సందర్శించిన జేసీ కమిటీ



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

రాంబిల్లి: సాహితి ఫార్మా కంపెనీని బుధవారం జాయింట్ కలెక్టర్ జాహ్నవి నేతృత్వంలో విచారణ కమిటీ సందర్శించింది. గత నెల 30న రియాక్టర్లు పేలి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు నలుగురు కార్మికులు సత్తిబాబు, తిరుపతి, రామేశ్వర్, అప్పారావు మృతి చెందారు. ఈ ప్రమాదంపై ప్రభుత్వం జేసీ జాహ్నవి నేతృత్వంలో విచారణ కమిటీని నియమించింది. ఈ కమిటీ బుధవారం సాహితి ఫార్మా కంపెనీని సందర్శించి విచారణ నిర్వహించింది. మీడియాను అనుమతించలేదు. కమిటీ సభ్యులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. సాల్వెంట్‌ల మిశ్రమంలో ఏయే రసాయనాలుంటాయి, ఎలా శుద్ధి చేస్తారు తదితర అంశాలపై ఆరా తీశారు. సాల్వెంట్ లోడింగ్ ఎలా చేస్తారు.. సాల్వెంట్ లోడింగ్ చేసే సమయంలో ఏమైనా పొరబాట్లు జరిగాయా అన్న కోణంలో విచారణ చేపట్టినట్లు తెలిసింది.

జల పుష్ప విలాసం!

- ఆశాజనకంగా చేపలవేట
- రెండు నెలల నిషేధం తర్వాత పుష్కలంగా లభ్యత
- గత ఏడాదికంటే బాగుందంటున్న బోటు యజమానులు

-8లో

46 మందికి గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి



పదోన్నతి పొందిన వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందజేస్తున్న ఆర్జేడీ జ్యోతికుమారి

మధురవాడ (విశాఖ): ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలో 46 మంది స్కూల్ అసిస్టెంట్లకు ప్రభుత్వ నిర్వహణలోని పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించినట్టు ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆదేశాలు జారీ చేసి.. వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. మధురవాడలోని జోన్-1 పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించే ప్రక్రియ మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఉమ్మడి విశాఖలో 25, విజయనగరంలో 7, శ్రీకాకుళంలో 14 కలసి మొత్తం 46 పోస్టులు ఖాళీ ఉన్నట్లు అధికారులు నిర్ధారించి కౌన్సెలింగ్ చేపట్టారు. మొత్తం 72 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఇందులో ముగ్గురు ప్రమోషన్ వద్దన్నారు. దీంతో వారి తర్వాత స్థానంలో ఉన్న వారికి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన వారిని వెంటనే ప్రస్తుత ప్రదేశాల నుంచి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రిలీవ్ చేయాలని ఆదేశించారు. పదోన్నతి పొందిన వారంతా తమకు కేటాయించిన పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంగా విధుల్లో చేరాలని తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జెడ్పీ యాజమాన్య పాఠశాలల్లో 22 మందికి..

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలో జెడ్పీ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న 22 మందికి గ్రేడ్-2 హెచ్‌ఎంగా పదోన్నతి కల్పిస్తూ విద్యాశాఖ ఆర్జేడీ ఎం.జ్యోతి కుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల హెచ్‌ఎంలను ఎంఈవోగా పదోన్నతులు కల్పించిన నేపథ్యంలో ఏర్పడిన ఖాళీల భర్తీ కోసం అర్హత గల స్కూల్ అసిస్టెంట్లకు ఈ నెల 4న కౌన్సెలింగ్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఖాళీల మేరకు, అర్హత గల ఆసక్తి చూపిన స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించినట్లు ఆర్జేడీ తెలిపారు. పదోన్నతి పొందిన వారిని వెంటనే ప్రస్తుత ప్రదేశాల నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు రిలీవ్ చేయాలని ఆదేశించారు. పదోన్నతి పొందిన వారంతా తమకు కేటాయించిన పాఠశాలల్లో గ్రేడ్-2 హెచ్‌ఎంగా విధుల్లో చేరాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు.

ఆర్బీకేల ద్వారా పశుగ్రాస విత్తనాలు

- రైతులకు 75 శాతం సబ్సిడీపై సరఫరా
- అందుబాటులో జొన్న, మొక్కజొన్న, సజ్జ, అలసంద విత్తనాలు
- భూమి పాస్ పుస్తకం నకలు సమర్పించి తీసుకునే అవకాశం
- సర్టిఫై చేసిన నాణ్యమైన సీఎస్‌హెచ్-24 విత్తనాలతో అధిక దిగుబడి



సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన పశుగ్రాస విత్తనాలను రైతులకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతుకు 75 శాతం సబ్సిడీపై స్థానికంగా డిమాండ్ ఎక్కువగా ఉన్న సీఎస్‌హెచ్-24 జొన్న రకం పశుగ్రాసం విత్తనాలను, మొక్కజొన్న, సజ్జ, అలసంద విత్తనాలను అందిస్తోంది. ప్రస్తుతం రైతులకు 48 టన్నుల వరకు జొన్న, మొక్కజొన్న, సజ్జ, అలసంద విత్తనాలను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచారు. 20 సెంట్ల నుంచి ఎకరం పొలం కలిగిన సన్న, చిన్నకారు రైతులకు 5 నుంచి 20 కిలోల వరకు సరఫరా చేయనున్నారు. రైతులు ఆర్బీకేల్లో భూమి పాస్ పుస్తకం నకలు సమర్పించి విత్తనాలను సబ్సిడీపై తీసుకునే అవకాశం వ్యవసాయ శాఖ కల్పించింది.

జొన్న విత్తనాలు

జిల్లాలో 21.55 టన్నుల సీఎస్‌హెచ్-24 రకం జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఈ విత్తనాలతో ఎకరానికి 35-40 టన్నుల వరకు (3 కోతలలో) దిగుబడి వస్తుంది. ఎకరానికి కావలసిన 15 కేజీల విత్తనాల మార్కెట్ ధర 460 వరకు ఉంటే.. ప్రభుత్వ సబ్సిడీ 75 శాతం (రూ.345)పోను రైతులు చెల్లించవలిసింది రూ.115లు మాత్రమే. ఈ పశుగ్రాసంలో మాంసకృత్తులు 7 నుంచి 8 శాతం వరకు ఉంటాయి. ఈ రకం జొన్న కీటకాలు, తెగుళ్లు రాకుండా తట్టుకోగలదు.

మొక్కజొన్న విత్తనాలు

జిల్లాలో 11.25 టన్నుల ఆఫ్రికన్ టాల్ రకం మొక్కజొన్న విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎకరాకు 12-15 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. 5 కిలోల విత్తనాల మార్కెట్ ధర రూ.340 ఉంటే.. ప్రభుత్వ సబ్సిడీ 75 శాతం (రూ.255) పోనూ రూ.85 చెల్లిస్తే చాలు. ఈ పశుగ్రాసంలో 11 నుంచి 13 శాతం వరకు మాంసకృత్తులు ఉంటాయని వైద్యులు వెల్లడిస్తున్నారు.

అలసంద విత్తనాలు

జిల్లాలో 8.36 టన్నుల ఈసీ 4215 రకం అలసంద విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. ఇవి ఎకరానికి 10-12 టన్నుల వరకు దిగుబడి ఇస్తాయి. ఎకరానికి 9-10 కేజీల విత్తనాలు వరకు అవసరం ఉంటుంది. 3 కిలోల విత్తనాల మార్కెట్ ధర రూ.295 ఉండగా.. ప్రభుత్వ సబ్సిడీ 75 శాతం 222) మినహాయించి రైతులు రూ.73 చెల్లిస్తే సరిపోతుంది. ఈ పశుగ్రాసంలో మాంసకృత్తులు 18 నుంచి 21 శాతం వరకు ఉంటాయి. వీటితోపాటు జీర్ణమయ్యే పదార్థాల శాతం 49 నుంచి 51 వరకు ఉంటుంది.

సజ్జ విత్తనాలు

జిల్లాలో 2 టన్నుల బీఏఐఎఫ్-1 రకం సజ్జ విత్తనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎకరానికి 10-12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఇవి ఒక ఎకరానికి 3-4 కేజీల వరకు సరిపోతాయి. కిలో విత్తనాల మార్కెట్ ధర రూ.98గా ఉంటే .. ప్రభుత్వ సబ్సిడీ పోను రూ. 24.5లకే ప్రభుత్వం అందిస్తోంది.

ఆర్బీకేల్లో సంప్రదించండి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్బీకేల ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నాం. అర్హత, ఆసక్తి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సమీప ఆర్బీకేల్లోని పశుసంవర్ధక సహాయకులను సంప్రదించండి. నాణ్యమైన సీఎస్‌హెచ్-24 విత్తనాన్ని తీసుకొని అదను దాటిపోకుండా నాటుకోవాలి.

– డాక్టర్ ప్రసాదరావు, పశుసంవర్ధక శాఖ జేడీ

జగనన్న సురక్షతో ప్రతి ఒక్కరికీ మేలు

- అర్హులైనవారు 11 రకాల సేవలు పొందవచ్చు
- కొరుప్రోలు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్మెల్యే బాబూరావు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



లబ్ధిదారుకు ధ్రువపత్రం అందజేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం: ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరాలి.. సమస్యలుంటే తక్షణం పరిష్కారం కావాలి.. ఇదే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం.. అర్హులైన ప్రతి ఒక్కరూ 11 రకాల సేవలను పొందవచ్చు.. అని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు గ్రామంలో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జగనన్న సురక్ష.. అన్ని రకాల సమస్యలకు పరిష్కార వేదికగా నిలుస్తుందని చెప్పారు. అర్హత ఉండి పింఛన్, ఇంటి స్థలం వంటివి దక్కని వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతుండగా కలెక్టర్ సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించేందుకు ఆకస్మికంగా సందర్శించారు. అందరికీ మేలు చేకూర్చే ఈ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు బాగున్నాయని, గ్రామంలో ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వ భూమి ఉన్నదని, దానిని చదును చేసి పట్టాలిచ్చేందుకు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు. తమ పరిధిలో ఉన్న మేర ప్రతి పనిని సకాలంలో చేస్తామని కలెక్టర్ చెప్పారు. కొరుప్రోలు గ్రామంలో జగనన్న కాలనీదారులు సంతోషం వ్యక్తపరచారని, అలా ప్రభుత్వ పథకాలతో లబ్ధి చేకూరిన వారు సంతృప్తికరంగా మాట్లాడాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. సర్వసిద్ధి గ్రామంలో నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో 790 దరఖాస్తులు రాగా 550 పరిష్కరించి లబ్ధిదారులకు అందజేసినట్టు తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, ఎంపీడీవో రామచంద్రమూర్తి, డీటీ శ్యామ్‌కుమార్, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, సర్పంచ్‌లు కొరపాటి గోపాలం, దారబోయిన గణేష్, ఎంపీటీసీ కేసుబోయిన వెంకటలక్ష్మి, నక్కపల్లి ఐసీడీఎస్ పీవో శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మండలంలోని గుడివాడ, చిన ఉప్పలం గ్రామాల్లో పర్యటించారు. గుడివాడలో నాడు-నేడులో రూ.కోటి 40 లక్షలతో చేపడుతున్న పనులు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, విద్యలో నాణ్యత ప్రమాణాలు మెరుగుపడేలా టీచర్లు కృషి చేయాలని చెప్పారు. గ్రామంలో నిర్మాణ తుది దశలో ఉన్న సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు. అనంతరం రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం గ్రామాలలోని జగనన్న కాలనీలను సందర్శించారు. రెండు గ్రామాలకు ఒకచోట సుమారు 4 వందలకు పైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం బాగుందన్నారు. కొన్ని ఇబ్బందులను స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే వారికి కావలసినవి ఏర్పాటు చేయాలని మండల ప్రత్యేకాధికారికి కలెక్టర్ సూచించారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వడ్డెర కులస్తులను బీసీ ఏలో చేర్చేలా చర్యలు



బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ శంకరనారాయణతో వడ్డెర సంఘ ప్రతినిధులు

మునగపాక: ఇతర జిల్లాల్లో మాదిరి ఉత్తరాంధ్రకు చెందిన వడ్డెర కులస్తులకు బీసీ–ఏ సర్టిఫికెట్ అందించేలా చర్యలు తీసుకుంటామని బీసీ కమిషన్ చైర్మన్ జస్టిస్ శంకర నారాయణ అన్నారు. వడ్డెర కులస్తులను విశ్వబ్రాహ్మణులుగా గుర్తించడంతో అన్యాయం జరుగుతోందని, తమకు న్యాయం చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, శాసనమండలి ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, శాసనమండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నంలతో కలిసి స్థానిక వడ్డెర సంఘ ప్రతినిధులు శంకర నారాయణకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఆయన ఉత్తరాంధ్రలో ఇందుకు సంబంధించి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వడ్డెర సంఘ ప్రతినిధులు ఆనంద్‌కుమార్, ఆదినారాయణ, కేఎల్‌జీ మోహనరావు, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తీరంలో అలజడి



మంగమూరిపేట బీచ్ వద్ద ఎగసి పడుతున్న కెరటాలు

కొమ్మాది: తీరంలో బుధవారం ఉదయం నుంచి ఒక్కసారిగా అలజడి మొదలైంది. ఉధృత గాలులతో పాటు సముద్ర కెరటాలు భారీ ఎత్తున ఎగసిపడ్డాయి. తిమ్మాపురం, రుషికొండ ప్రాంతాల్లో సముద్రం కాస్త ముందుకు వచ్చింది. దీంతో రుషికొండ బీచ్‌కు సాయంత్రం వచ్చిన సందర్శకులను సముద్రంలోకి వెళ్లకుండా మెరైన్ పోలీసులు, జీవీఎంసీ లైఫ్ గార్డ్స్ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ అప్రమత్తం చేశారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం బూడి ప్రారంభోత్సవం



సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

మాడుగుల : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. బుధవారం జోరు వానలో మండలంలోని పలు గిరి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. గొప్పుల పాలెంలో రూ.12.75 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. జాలంపల్లిలో రూ.20.9 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని, రూ.40 లక్షలతో కొత్తగా కట్టిన సచివాలయ భవనాల శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణానికి 69 మంది లబ్ధిదారులకు రూ.కోటీ 24 లక్షలు మంజూరు చేశామన్నారు.

అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రేనేజీల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులును ఆదేశించారు. కొండవీధి నుంచి కామకూటం వరకు రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన జాలంపల్లి అంగన్‌వాడీలో నిర్వహించిన సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి, అంగన్‌వాడీ కార్యకర్తను, ఆయాను దుశ్శాలువాతో సత్కరించారు. సీమంతాలు చేసుకున్న గర్భిణులను ఆశీర్వదించారు. చిన్నారులను ఎత్తుకుని అన్నప్రాశన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, మండల సచివాలయ కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి అన్నప్రాశన చేస్తున్న డిప్యూటీ సీఎం

మెనూ సక్రమంగా అమలు చేయాలి



వేములపూడి జెడ్పీ హైస్కూల్ స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ కమిటీ సభ్యుడు కాంతారావు

నర్సీపట్నం: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యుడు కాంతారావు సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. బుధవారం ఆయన వేములపూడి పాఠశాలలో విద్యార్థులకు తయారు చేసిన భోజనాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల హాజరు పట్టికలో దిద్దివేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి 43 రేషన్ దుకాణాన్ని పరిశీలించారు. అక్కడ ఉండాల్సిన స్టాక్ కంటే 200 కిలోల బియ్యం ఎక్కువగా ఉండటాన్ని గుర్తించి, డీలర్‌పై కేసు నమోదు చేయాలని ఏఎస్‌వో నందకిషోర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాల నాణ్యతలో ఎక్కడా రాజీ పడేదిలేదన్నారు. ప్రజలకు ఇచ్చే రేషన్ తూకంలో తేడాల్లేకుండా చూడాలన్నారు. జాతీయ ఆహార భద్రత చట్టంలో భాగంగా ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్పీ హైస్కూల్ (తురకబడి) మీదుగా వెళుతూ విద్యార్థులను చూసి ఫుడ్ కమిటీ మెంబర్ వాహనాన్ని ఆపి వారితో మాట్లాడుతుండగా.. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోందని ఏఎస్సై అభ్యంతరం చెప్పారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఏఎస్సై తీరుపై ఫుడ్‌కమిటీ మెంబర్ అసహనం వ్యక్తం చేశారు.

బొడ్డేడకు అభినందనలు



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ను సత్కరిస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ చినతల్లి

మునగపాక: వైఎస్సార్‌సీపీ జిల్లా నూతన అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు డీసీఎంఎస్ చైర్‌పర్సన్ చినతల్లి బుధవారం అభినందనలు తెలిపారు. బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో కలిసి ఆమె దుశ్శాలువాతో సత్కరించారు. ప్రసాద్ నాయకత్వంలో రానున్న రోజుల్లో పార్టీ మరింత బలోపేతం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

లబ్బూరు వద్ద 30 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్ట్ , రిమాండ్‌కు తరలింపు



పట్టుబడ్డ గంజాయి, నిందితులతో ముంచంగిపుట్టు పోలీసులు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు జంక్షన్ వద్ద అక్రమంగా ఒడిశాకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన బైకు, బొలెరో వాహనం, రెండు సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కె.రవీంద్ర కథనం ప్రకారం వివరాలివి. గంజాయి రవాణాపై పక్కా సమాచారం రావడంతో లబ్బూరు జంక్షన్ వద్ద బుధవారం ఉదయం బరడ నుంచి లబ్బూరు జంక్షన్ వైపు వస్తున్న బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 30 కిలోల గంజాయి బయటపడింది. బొలెరో వాహనం వెనక పైలెటింగ్ చేస్తున్న వ్యక్తిని సైతం గుర్తించి, ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.60 వేలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. నిందితులను ఒడిశా రాష్ట్రం కొర్రాపుట్టు జిల్లా బడిగడ పంచాయతీ జయంతగిరి గ్రామానికి చెందిన షూసీ ఖరాతో పాటు ముంచంగిపుట్టు మండలం వనుగుమ్మ పంచాయతీ తర్లగూడ గ్రామానికి చెందిన వంతాల దేవదాసుగా గుర్తించామని, వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు.

పాత గంజాయి కేసులో వ్యక్తి అరెస్టు

684 కిలోల గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ఏ–1 నిందితుడిని బుధవారం అరెస్టు చేశామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. గత ఏడాది జూన్‌లో లబ్బూరు వద్ద 684 కిలోల గంజాయిని పట్టుకోగా, మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ కిందుగూడ గ్రామానికి చెందిన కిల్లో త్రినాథ్ తప్పించుకు పారిపోయాడని, బుధవారం త్రినాథ్‌ను ముంచంగిపుట్టులో గుర్తించి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు.

'బీసీ గర్జన సభ'కు పక్కి దివాకర్ పేరు



సీఎం వైఎస్ జగన్‌కు బీసీ గర్జన సభ కోసం వివరిస్తున్న ఎంపీ కృష్ణయ్య, కర్రి వేణుమాధవ్

ఆరిలోవ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న ఏయూలో జరగనున్న బీసీ గర్జన సభకు దివంగత బీసీ కమిషన్ సభ్యుడు పక్కి దివాకర్ సభా వేదికగా నామకరణం చేసినట్టు సంఘం అధ్యక్షుడు, ఎంపీ కృష్ణయ్య, ఢిల్లీ అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ తెలిపారు. బుధవారం ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం జగన్‌ను ఎయిర్‌పోర్టులో కలిసి సభ వివరాలను తెలియజేశారు. వైఎస్సార్ సీపీ నుంచి సభకు ప్రతినిధులను పంపించాలని కోరారు. ఇందుకు ఎంపీ మిథున్‌రెడ్డిని సంప్రదించాలని సీఎం సూచించినట్టు వేణుమాధవ్ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

- యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టు తీర్పు

సాక్షి, అనకాపల్లి : రెండేళ్ల క్రితం నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో జరిగిన చోరీ కేసులో నిందితుడు బసవరాజు శ్రీనివాస్‌కు మూడేళ్ల కారాగార శిక్షను విధిస్తూ బుధవారం యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టు తీర్పునిచ్చింది. 2020, అక్టోబర్ 27న నక్కపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో ఉద్దండపురం గ్రామానికి చెందిన కొంతం నూకరత్నం ఇంట్లో మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, ఐదు తులాల వెండి పట్టీలు దొంగిలించిన కేసులో నిందితుడికి శిక్ష పడింది. వివరాలివి. అక్టోబర్ 27న మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో నూకరత్నం బయటకు వెళ్లిన సమయంలో ఆ ఇంట్లోకి చొరబడిన శ్రీనివాస్ బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

నగలు అమ్ముతూ పట్టుబడ్డాడు...

తెలంగాణలోని నల్గొండ జిల్లా రాంనగర్‌కు చెందిన శ్రీనివాస్‌పై హైదరాబాద్, నల్గొండ, విజయవాడ తదితర ప్రాంతాల్లోనూ పలు చోరీ కేసులున్నాయి. 2021 మార్చిలో గుంటూరు జిల్లా పత్తిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ చేసిన నగలను అమ్మే క్రమంలో అతను పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణలో నిందితుడి వద్ద లభించిన వెండి పట్టీలు నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలో చోరీ చేసినవని గుర్తించారు. దీంతో అనకాపల్లి జిల్లా పోలీసులు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో అభియోగపత్రం పొందుపరిచారు. అడిషనల్ పీపీ జ్యోతిసుధ వాదనలు వినిపించారు. నేరం రుజువై నిందితుడికి మూడేళ్ల కారాగార శిక్షను విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈమేరకు పీపీ జ్యోతి సుధ, కేసు దర్యాప్తు చేసిన ఎస్‌ఐ శిరీషను జిల్లా ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

హౌసింగ్ సిబ్బందికి సత్కారం



దేవరాపల్లి హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ భవ్యతేజను సత్కరిస్తున్న గృహనిర్మాణ శాఖ జిల్లా అధికారి కొయ్య రమామణి

తుమ్మపాల: కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని గృహనిర్మాణ శాఖ జిల్లా అధికారి కొయ్య రమామణి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ 44వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని నూకాలమ్మ దేవాలయం వద్దనున్న కల్యాణమండపంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖలో అత్యుత్తమ పనితీరు కనబరచిన 59 మంది సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈ, డీఈలకు ప్రతిభా పురస్కారాలను ఆమె అందించి సత్కరించారు. విధుల పట్ల నిబద్ధత, కచ్చితత్వంతో పనిచేయాలని కోరారు. జిల్లాలో గృహ నిర్మాణ శాఖ ద్వారా జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ లబ్ధిదారులకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్న పలు ప్రాంతాల ఇంజినీరింగ్ సిబ్బందిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో డీఈఈలు కిరణ్‌బాబు, ప్రసాద్, కె.గౌతమ్, శేఖర్, వీఎస్ఎస్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

14,15 తేదీల్లో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్



సౌత్ ఇండియా ఓపెన్ కరాటే పోటీల ట్రోఫీ, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్: సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ఈనెల 14, 15 తేదీల్లో గవరపాలెం వీవీ రమణ రైతు భారతి ఏసీ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక రైతు భారతి ఏసీ ఫంక్షన్ హాల్లో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ పోటీల్లో తెలంగాణా, తమిళనాడు, కర్ణాటక, ఏపీ రాష్ట్రాలతో పాటు మిగిలిన రాష్ట్రాల క్రీడాకారులకు ఆహ్వానాలు పంపినట్లు పేర్కొన్నారు. కొత్త జిల్లాకు దేశ వ్యాప్తంగా పేరు తీసుకురావాలనే ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 15న ముగింపు కార్యక్రమంలో జాతీయ కరాటే చైర్మన్ డాక్టర్ సుమన్ తల్వార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో సుమారుగా 400 మంది క్రీడాకారులు పాల్గొంటారని, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులకు పూర్తి స్థాయిల్లో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోటీల కరపత్రాలను, ట్రోఫీను రత్నాకర్ ఆవిష్కరించారు. గత ఏడాది స్థానిక రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో కరాటే పోటీలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వివిధ వర్గాల క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 15 నుంచి స్థానిక రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో కూడా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మహిళలు కరాటేపై ఆసక్తి పెంచుకుంటే అత్యవసర సమయంలో వారి ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనకాపల్లికి చెందిన కరాటే క్రీడాకారుడు ఈశ్వరరావు మలేషియాలో ఉత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జిలు కొణతాల భాస్కర్, పీలా రాంబాబు, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిలపరశెట్టి బాబి, ఎస్ఎస్ఎస్‌కేపీఐ విశాఖ జిల్లా అధ్యక్షుడు పీఎస్ఎండీ నాయుడు, టెక్నికల్ అడ్వైజర్ వై.రవీంద్ర కుమార్, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.శివ, భీశెట్టి కృష్ణఅప్పారావు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

- యర్రవరం పెట్రోల్ బంక్ వద్ద ఘటన



మృతుడు పిల్లా సతీష్‌కుమార్

యలమంచిలి : లారీ క్యాబిన్‌లో నిద్రపోయిన డ్రైవర్ తెల్లారేసరికి విగతజీవిగా మారిన ఘటన యలమంచిలి పట్టణంకు సమీపంలో జాతీయ రహదారిపై యర్రవరం భారత పెట్రోలియం అవుట్ లెట్ వద్ద బుధవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి యలమంచిలి పట్టణ ఎస్‌ఐ కె. సావినాయుడు తెలిపిన వివరాలు ప్రకారం నర్సీపట్నం కాపు వీధికి చెందిన పిల్లా సతీష్‌కుమార్(26) యలమంచిలి మండలం ములకలాపల్లి సిమెంట్ ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి లారీని తీసుకువచ్చిన సతీష్ కుమార్ బీపీ అవుట్‌లెట్ వద్ద లారీని ఆపి రాత్రి భోజనం తర్వాత క్యాబిన్‌లో నిద్రపోయాడు. తెల్లారేసరికి అనుమానస్పదంగా మృతి చెందాడు. దీన్ని గమనించిన పెట్రోల్ బంకు సిబ్బంది పోలీసులకు సమాచారం అందజేయగా పట్టణ ఎస్‌ఐ సావినాయుడు ఘటనా స్థలానికి బుధవారం సాయంత్రం వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకి తరలించామని, పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా అనారోగ్యంతో మృతి చెందాడా లేదా అనేది తెలియాల్సి ఉందని తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందించి..



తాతబాబుకు పింఛన్ అందిస్తున్న నాయుడు



ప్రకాష్‌కు పింఛన్ నగదు అందిస్తున్న రాజేష్, తేజ

రావికమతం: వలంటీర్లు తమ నిబద్ధత చాటుకుంటున్నారు. అనారోగ్య కారణంగా స్థానికంగా అందుబాటులో లేని పింఛన్ లబ్ధిదారులకివ్వాల్సిన నగదును వారు చికిత్స పొందుతున్న చోటుకే వెళ్లి అందిస్తున్నారు. కవగుంట గ్రామ వలంటీర్ సింహాచలం విశాఖ వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న పేషెంట్ మధురవాడ కృష్ణమ్మకు బుధవారం పింఛన్ అందించారు.

అదే గ్రామానికి చెందిన ఉరికూటి తాతబాబు విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతుడటంతో అతనికి ఆ వలంటీర్ ప్రగడ నాయుడు పింఛన్ నగదు ఇచ్చారు. విశాఖ అపోలోలో చికిత్స పొందుతున్న ఎల్లేటి ప్రకాష్‌కు ఆ గ్రామ వలంటీర్లు శీలం రాజేష్, వి.తేజ పింఛన్ అందించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, మనోధైర్యం అందించారు.



కృష్ణమ్మకు పింఛన్ అందిస్తున్న సింహాచలం

'16 రోజుల్లో సినిమా చిత్రీకరణ పూర్తి చేస్తాం'

డాబాగార్డెన్స్: జెస్విన్ సినిమాస్ బ్యానర్‌పై నిర్మించబోయే రెండో చిత్రాన్ని నిర్మాత ప్రకటించారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం కొత్త చిత్రం వివరాలను వెల్లడించారు. ముందుగా నిర్మాత బెన్నబత్తుల బ్రహ్మాజీ మాట్లాడుతూ జెస్విన్ సినిమాస్ పతాకంపై గతంలో తస్మాత్ జాగ్రత్త సినిమా తీశానని గుర్తు చేశారు. రెండో సినిమా కేవలం 16 రోజుల్లో చిత్రీకరణ పూర్తి చేసి.. ఈ ఏడాది డిసెంబర్‌లో సినిమా విడుదల చేస్తామని వెల్లడించారు. దర్శకుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ, అరకు తదితర లొకేషన్లలో సినిమా చిత్రీకరణ పూర్తి చేస్తామన్నారు. హీరో రతన్‌కాంత్ మాట్లాడుతూ తస్మాత్ జాగ్రత్త సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యాయని, రెండో సినిమాలో కూడా మంచి పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. ఈ సినిమాలో తనది మంచి పాత్ర అని హీరోయిన్ సుష్మా జెస్విన్ తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్లు దుర్గాప్రసాద్, నాగమణి, కెమెరామెన్ సంతోష్ పాల్గొన్నారు.

జల పుష్ప విలాసం!

- ఆశాజనకంగా చేపలవేట
- రెండు నెలల నిషేధం తర్వాత పుష్కలంగా లభ్యత
- గత ఏడాదికంటే బాగుందంటున్న బోటు యజమానులు
- బోట్ల నిండా చేపలతో తిరిగొస్తున్న మత్స్యకారులు

సాక్షి, విశాఖపట్నం: రెండు నెలల విరామం తర్వాత వేటకు వెళ్లిన బోట్లకు చేపలు పుష్కలంగా లభిస్తున్నాయి. ఇవి మత్స్యకారుల మోముల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. గత ఏడాదికంటే ఈసారి సీజను ప్రారంభం ఆశాజనకంగా ఉండడం వీరికి ఊరటనిస్తోంది. చేపల వేట నిషేధం అనంతరం జూన్ 15 నుంచి బోట్లు తొలి దఫా వేటకు వెళ్లి వచ్చాయి. సాధారణంగా మరబోట్లు 10–12 రోజులు, మరికొన్ని బోట్లు వారం రోజులు వేట సాగిస్తాయి. ప్రస్తుతం వీటిలో కొన్ని బోట్లు రెండో విడత వేట కూడా పూర్తి చేశాయి. వారం లోపు వేట సాగించిన బోట్లకు 2–3 టన్నుల చేపలు లభ్యమవుతున్నాయి. వీరి వలలకు మార్కెట్లో మంచి ధర పలికే చేపలు కూడా చిక్కుతున్నాయి. వీటిలో కండవాలు, కానాగడసలు, పారలు, మెత్తని పారలు, గులివిందలు, కళ్ల ఒడుగులు, బడే మట్టలు, సైమన్‌లు వంటివి ఉన్నాయి. కండవాలు, చందువాలు వంటివి కిలోల లెక్కన, మిగిలిన చేపలు బాస్కెట్ (7 కిలోలు) చొప్పున కొనుగోలు చేస్తుంటారు. ఇలా కండవాలు కిలో రూ.200–275 ధర పలుకుతోంది. కానాగడసలు బాస్కెట్ రూ.700–800, మెత్తని పారలు రూ.500–600 (పెద్దవి రూ.800–900), సైమన్లు రూ.500–600 (పెద్దవి రూ.1000–1200), పారలు రూ. 800–1000 వరకు ధర పలుకుతోంది. ఇవి గిట్టుబాటు ధరలే అయినప్పటికీ ఒడిశా, తదితర ప్రాంతాల నుంచి కూడా ఈ హార్బర్‌కు వ్యాన్లలో చేపలు తెచ్చి విక్రయిస్తుండడం వల్ల వ్యాపారులు/దళారులు రింగ్ అయి తక్కువ రేట్లకు కొనుగోలు చేస్తున్నారని దూడ పోలయ్య అనే బోటు యజమాని 'సాక్షి'తో చెప్పారు.

పశ్చిమ తీరానికి ఎగుమతి..

విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి దాదాపు 600 మరబోట్లు, 1250 వరకు మోటారు బోట్లు సముద్రంలో వేట సాగిస్తుంటాయి. ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి జూన్ 15 వరకు 61 రోజుల పాటు తూర్పు తీరంలో వేట నిషేధం అమలులో ఉంటుంది. ఇక్కడ నిషేధం పూర్తయ్యాక పశ్చిమ తీరంలో మొదలవుతుంది. ఈ సమయంలో తూర్పు తీరంలో పట్టుబడిన చేపలు కొచ్చిన్, మంగుళూరు, ఉడిపి తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. అందువల్ల ఈ తరుణంలో చేపలకు మంచి ధర లభించడానికి దోహదపడుతుందని దానయ్య అనే బోటు యజమాని 'సాక్షి'కి చెప్పారు.



గులివిందలు



మెత్తని పారలు

రొయ్యల లభ్యత కూడా..

మరోవైపు ప్రస్తుతం చేపలతో పాటు రొయ్యల లభ్యత కూడా బాగుంది. వారంలోపు వేట సాగిస్తున్న కొన్ని బోట్లకు టన్ను వరకు పడుతున్నాయి. వీటిలో చిన్న రొయ్యలతో పాటు బ్రౌన్, పింక్, వైట్, టైగర్ రొయ్యలు కూడా ఉంటున్నాయి. కానీ వీటి ధరలు కూడా తక్కువగా ఉండడం వల్ల గిట్టుబాటు కావడం లేదని బోటు యజమానులు చెబుతున్నారు. అయితే విదేశాల నుంచి కొనుగోళ్లు సన్నగిల్లడంతో ఎగుమతులు క్షీణించాయని, దీంతో ఆ ప్రభావం రొయ్యలపై కూడా పడుతోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.



రొయ్యలు

చెరకు సాగు.. కాదు బాగు


కశింకోటలో చెరకు సాగు


ఏనుగుతుని గ్రామంలో ఎదుగుదల లేని చెరకు తోట

- పెట్టుబడి పెరిగి.. గిట్టుబాటు లేదంటున్న చెరకు రైతులు
- వరి సాగు వైపు మరలిపోతున్న అన్నదాతలు
- మెలకువలతో మంచి ఫలితాలంటున్న వ్యవసాయాధికారులు

మండల రైతులు క్రమేపీ చెరకు పంట సాగుపై ఆసక్తి కోల్పోతున్నారు. పెట్టుబడి అధికం కావడం, దిగుబడి తగ్గడం, గిట్టుబాటు ధర లభించకపోవడంతో వరి వైపు వారంతా దృష్టి సారిస్తున్నారు. అయితే రైతులు సాగులో మెలకువలు పాటిస్తే దిగుబడి పెరిగి లాభాలు ఆర్జించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

కశింకోట : మండల రైతాంగం చెరకు పంట సాగుపై అనాసక్తి చూపుతున్నారు. దీంతో ఏటా సాగు విస్తీర్ణం క్రమేపీ తగ్గిపోతోంది. పెట్టుబడి, ఖర్చులు అధికం కావడం, పంట సాగు గిట్టుబాటు కాకపోవడం ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయి. మండల ప్రజలకు వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. వరి, చెరకు, సరుగుడు పంటలను ఎక్కువగా సాగు చేస్తారు. వీటిలో చెరకు లాభదాయకంగా ఉండటంతో ఎక్కువగా సాగు చేసేవారు. పంటల సాగులో ఇదే అగ్రస్థానంలో ఉండేది. అయితే కాల క్రమంలో పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడం, మార్కెట్‌కు తరలించే బెల్లానికి గిట్టుబాటు ధర లభించకపోవడంతో నష్టపోతున్న పరిస్థితి. దీంతో గత ప్రభుత్వ హయాం నుంచి చెరకు సాగుకు వెనుకాడుతుండటంతో పంట విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతోంది. మండలంలోని కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, తాళ్లపాలెం, జమాదులపాలెం, ఏఎస్ పేట, ఉగ్గినపాలెం, గొబ్బూరు, పేరంటాలపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, సోమవరం, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని, నరిసింగబిల్లి, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, అచ్చెర్ల, జి. భీమవరం తదితర గ్రామాల్లో ఎక్కువగా చెరకు సాగు చేస్తారు. గతంలో తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీకి మండల గ్రామాల నుంచి ఎక్కువగా సరఫరా చేసేవారు. ఫ్యాక్టరీ మూతపడటంతో ఆ అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు బెల్లం తయారు చేస్తున్నారు.

దాన్ని మార్కెట్‌కు తరలిస్తే పాకం(టన్నుంపావు చెరకుతో తయారు చేసినది) నాణ్యమైన బెల్లానికి మూడు వేలు మించి రావడం లేదు. క్రషర్ అద్దె రూ.500, కూలీ ఖర్చులు రూ.1800, రవాణా ఖర్చులు రూ.200, బెల్లం తయారీలో కలిపే సున్నం, మందులకు రూ.200 ఖర్చు అవుతోంది. ఇంకా అమ్మకం కమిషన్లు వగైరా ఖర్చులు ఉంటాయి. దీంతో వచ్చిన ఆదాయం.. ఖర్చు ఒకటే అవుతుందని.. లాభం కనిపించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మార్కెట్‌లో బెల్లానికి మాత్రం ఎక్కువ గిరాకీ ఉంది. వ్యాపారులు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నప్పటికీ రైతులకు మాత్రం తక్కువ ధరే చెల్లిస్తున్నారు. పైగా చెరకు తోటలకు ఎర్రకుళ్లు తెగులు, పసుపాకు తెగులు ఆశించి నష్టం వాటిల్లుతోంది. వీటి నివారణకు మందులు లేవని, పంట మార్పిడి చేయడమే ఉత్తమ మార్గమని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు.

అలాగే చెరకు ఎదుగుదల కూడా ఉండటం లేదని, గతంలో ఎకరాకు 25 నుంచి 30 పాకాల వరకు బెల్లం వచ్చేదని, ఇప్పుడు సగం కంటె తక్కువ దిగుబడి వస్తోందని రైతులు అంటున్నారు. ప్రత్యామ్నయంగా వరి సాగు వైపు మళ్లిపోవలసి వస్తోందని వాపోతున్నారు. ఏయేటికి ఆ ఏడు చెరకు విస్తీర్ణం తగ్గిపోతోంది. చెరకు పంట సాగు ఆశాజనకంగా లేదని అధికారులు కూడా చెబుతున్నారు. అయితే ఎప్పుడూ ఒకే చెరకు పంట వేస్తుండటం వల్ల భూసారం లోపించి ఎదుగుదల లేక దిగుబడి తగ్గిపోతుందంటున్నారు. ఎర్రకుళ్ల తెగులు, పసుపాకు తెగుళ్లు ఆశించి నష్టం కలిగిస్తోంది.

దీని నివారణకు మందు లేదని, మూడేళ్లకు ఒకసారి పంట మార్పిడి చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందంటున్నారు. అలాగే ఉడుపు తోట, ఒక దఫా కార్శి మాత్రమే పండించాలని, కొందరు 2,3 కార్శి తోటలు ఉంచి సాగు చేయడం వల్ల ఎదుగుదల లేక దిగుబడి తగ్గిపోతుందంటున్నారు. సాగులో మెలకువలు పాటిస్తే చెరకు ఎప్పటిలాగే దిగుబడి సాగించవచ్చంటున్నారు.

సాగులో మెలకువలు పాటించాలి..

మండలంలో చెరకు సాగు విస్తీర్ణం ఏటా తగ్గతోంది. కొందరు వరి సాగువైపు మళ్లిపోతున్నారు. సాగులో మెలకువలు పాటించకపోవడం వల్ల చెరకు దిగుబడి తగ్గపోతోంది. కనీసం మూడేళ్లకు ఒకసారి పంట మార్పిడి చేయాలి. దీనివల్ల తెగుళ్లు అదుపులోకి వస్తాయి. అలాగే చెరకు ఉడుపు, ఒక దఫా కార్శి తోటను మాత్రమే సాగు చేసుకోవాలి. రెండు, మూడు కార్శి తోటలు సాగు చేయడం వల్ల ఎదుగుదల లేక దిగుబడి తగ్గిపోతుంది. మార్కెట్‌లో బెల్లానికి ఆశించిన ధర లభించక కొందరు సాగు పట్ల ఆసక్తి చూపడం లేదు.

–స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట.

క్లుప్తంగా

బొజ్జన్నకొండ అభివృద్ధికి వినతి


ఎంపీ సత్యవతికి వినతిపత్రం అందిస్తున్న నాగభూషణం

తుమ్మపాల: బొజ్జన్న కొండ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.15 కోట్ల నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సిద్ధార్థ సోషల్ వెల్ఫేర్ సంఘ అధ్యక్షుడు బల్లా నాగభూషణం ఎంపీ భీశెట్టి సత్యవతికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని ఎంపీ నివాసంలో బుధవారం ఆమెను కలిసి కొండ అభివృద్ధికి అదనంగా కొన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీనికి స్పందించిన ఎంపీ సత్యవతి మాట్లాడుతూ అన్ని మౌలిక వసతులతో డిసెంబర్ నాటికి బొజ్జన్నకొండను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారని నాగభూషణం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.7.2 కోట్లు, రాష్ట్రం నుంచి రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వినకోట నీలేశ్ గుప్తా, మోహన్, రొబ్బి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీ విత్తనాల పంపిణీ


కొరువాడలో విత్తనాలు అందిస్తున్న ఎంపీటీసీ అచ్చిబాబు

కె.కోటపాడు : ఖరీఫ్ సాగులో భాగంగా రైతులకు రాయితీపై వరి విత్తనాలను అందిస్తున్నట్లు ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు తెలిపారు. కొరువాడ గ్రామంలోని ఆర్బీకే వద్ద బుధవారం రైతులకు రాయితీపై వరి విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా అచ్చిబాబు మాట్లాడుతూ రైతులు విత్తనాల కోసం రవాణా భారం లేకుండా సొంత గ్రామాల్లోనే ఆర్బీకేల ద్వారా విత్తనాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. రైతులకు రాయితీపై శ్రీధృతి, ఆర్‌జీఎల్, సాంబమసూరి, సోనామసూరి, స్వర్ణ వరి విత్తనాలను అందించినట్లు వ్యవసాయశాఖ సహాయకుడు ఎ.అప్పలనాయుడు తెలిపారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని సాగులో లాభాలు ఆర్జించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

లవ్ యూ రామ్ : రాజా
టక్కర్ : సత్యనారాయణ స్క్రీన్-1
ఇండియానా జోన్స్ : సత్యనారాయణ స్క్రీన్-2
ఈ నగరానికి ఏమైంది? (మార్నింగ్,మ్యాట్నీ)
మాయా పేటిక (ఫస్ట్,సెకెండ్ షో) : షిర్డిసాయి
అశ్విన్స్ : పర్తిసాయి
భీమదేవరపల్లి బ్రాంచి(3 ఆటలు)
నారాయణ అండ్ కో: వెంకటేశ్వర
స్పై : శ్రీసత్య
సామజవరగమన: రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 169 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	-	-
రెండో రకం	4,020	4,020
మూడోరకం	3,800	4,010

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 72 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-25 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-26 యూనిట్లు, ఓ నెగిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 426 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 359 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలి


గాడివీధిలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో మొక్కలు నాటుతున్న గృహ నిర్మాణ సంస్థ పీడీ రమామణి

కశింకోట : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని గృహ నిర్మాణ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రమామణి కోరారు. గృహ నిర్మాణ శాఖ 44వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గాడి వీధిలోని వైఎస్సార్ జగనన్న లే-అవుట్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. తమ సంస్థ ద్వారా ప్రభుత్వం గృహాలను నిర్మిస్తుందని, వీటికి మెటీరియల్ ఉచితంగా సమకూరుస్తుందన్నారు. ఒక్కొక్క గృహ నిర్మాణానికి రూ.లక్షా 80 వేలు అందిస్తోందన్నారు. కాలుష్యాన్ని నివారించడానికి జగనన్న లే-అవుట్లలో నాటుతున్న మొక్కల సంరక్షణకు లబ్ధిదారులు, అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. అసిస్టెంట్ మేనేజర్లు చింతాడ కిరణ్‌బాబు, కె.గౌతం, డీఈఈ పి.ప్రసాద్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, జేఏసీ నాయకులు శేఖర్, ఎస్.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు, జిల్లా వర్కింగ్ ఇన్‌స్పెక్టర్స్ యూనియన్ నాయకులు జి.నూకరాజు, వెలగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి


ఆర్డీవో కార్యాలయలంలో వినతిపత్రం అందిస్తున్న సూదికొండ మాణిక్యాలరావు

తుమ్మపాల : ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రైవేటు భవనాల అద్దెలకు ఖర్చయ్యే లక్షల ప్రజాధనాన్ని ఆదా చేయాలని కోరుతూ బీఎస్పీ నేత సూదికొండ మాణిక్యాలరావు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా ఉన్న అనకాపల్లిలో అనేక ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్నప్పటికీ మరమ్మతు చేపట్టకుండా లక్షల రూపాయలు అద్దె చెల్లించడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనన్నారు. అనకాపల్లి అర్బన్ ప్రాంతానికి ప్రత్యేకంగా తహసీల్దార్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు శ్రీనివాసరావు, సీమాంధ్ర బీసీ సంఘం నాయకుడు జొన్నకోట చెన్నమూర్తి పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ సుబ్బరాజు

అనకాపల్లిటౌన్ : గంజాయి రవాణాపె ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు డీఎస్పీ వి.సుబ్బరాజు తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాడేపల్లికి చెందిన బిట్రా రామోజీ గణేష్, ఉయ్యూరుకు చెందిన వినయ్‌రెడ్డి ఈనెల 1వ తేదీన 1.9 కేజీల గంజాయి తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరిని విచారించగా మరో ఇద్దరి ప్రమేయం ఉందని తెలిసిందన్నారు. ఒడిశాలో గంజాయి పండించి రవాణా చేస్తున్న దొడ్డిపట్ల చెన్నకేశవ్, కిల్లో గాసిరాంలను అదుపులోకి తీసుకొని చోడవరం న్యాయస్థానంలో హాజరుపరిచామని డీఎస్పీ చెప్పారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు చెకపోస్టులు ఏర్పాటు చేశామన్నారు. 2022-23లో గంజాయి రవాణాకు సంబంధించి 87 కేసులు నమోదు చేసి 4180 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, 190 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో కె.కోటపాడు సీఐ తాతారావు, ఎస్ఐ ధనుంజయ్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట


రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ గోవింద్, సర్పంచ్ నారాయణమూర్తి

సబ్బవరం: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి అన్నారు. మండలంలోని అంతకాపల్లి రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు రాయితీపై వరి విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు,క్రిమి సంహారక మందులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులోకి తెస్తామన్నారు. సోనామసూరి, సాంబామసూరి, శ్రీకాకుళం సన్నాలు వంటి రకాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేముడు బాబు,వైస్ సర్పంచ్ గొర్లి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి రవి,సచివాలయ కన్వీనర్ గొర్లి ఎర్రినాయుడు, వార్డు మెంబర్లు జక్కాన శ్రీనివాసరావు, ఎం. పైడితల్లి, గొంప వరలక్ష్మి, కొల్లి దాసు తదితరులు పాల్గొన్నారు.

'చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి'


దాతలు ఇచ్చిన సామగ్రితో సీడీపీవో ప్రభావతి, చిన్నారులు, తల్లిదండ్రులు

అనకాపల్లిటౌన్: అంగన్‌వాడీ చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని సీడీపీవో పి.ప్రభావతి అన్నారు. స్థానిక చిన్నవీధి జార్జ్‌స్కూల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్‌కేర్ ఎడ్యుకేషన్(ఈసీసీ) కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య నేర్పడంతోపాటు, రుచికరమైన వంటకాలను తయారు చేసి అందిస్తున్నట్టు పేర్కొన్నారు. చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కృషి చేయాలన్నారు. బోయిన రమణాజీ, గోకరణ, సాయికీర్తి, కొండ, స్వాతి, పెంటయ్యశెట్టి ఆర్థిక సహకారంతో చిన్నారులకు బ్యాగ్‌లు, పెన్సిళ్లు, డ్రాయింగ్ బాక్స్‌లు, గ్లాసులు, వాటర్‌బాటిళ్లు అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు కాసులమ్మ, తులసి తదితరులు పాల్గొన్నారు.

వల్లూరులో 'జగనన్న సురక్ష' నేడు

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీనగ్రామం వల్లూరులోని 26, 27 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్సీ పి.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్, 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహ సారథులు, అంగన్‌వాడీ టీచర్లు, దరఖాస్తుదారులు హాజరుకావాల్సిందిగా కోరారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతి


ఈఈ రాజశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

అనకాపల్లిటౌన్ : పట్టణంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్‌కు బుధవారం ప్రజా సంఘాల నేతలు వినతి పత్రం అందజేశారు. లోవోల్టేజీ, విద్యుత్ కోతలు నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు విల్లూరి పైడారావు, బొట్టా చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బొబ్బిలి గోవింద, వాసుపల్లి తాతీలు, మడగ అప్పారావు, బొడ్డు సోమరాజు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత

పరవాడ: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని గ్రామంలో బుధవారం బ్రూస్లీరాజ్ ఒలింపిక్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ14వ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె అకాడమీ జెండాతో పాటు 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కరాటే గ్రాండ్ మాస్టర్ ఎస్. నూకరాజు, కరాటే మాస్టర్లు ఓ.ప్రసాద్, జి.పుష్పారావు, సీహెచ్.అప్పలరాజు, ఎ.అప్పలరాజు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల సత్వర పరిష్కారం


నూతలగుంటపాలెంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం, నూతలగుంటపాలెం సచివాలయాల్లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 1030 మందికి కుల, ఆదాయ పత్రాలు, ఆధార్ లింకేజీ, బియ్యం కార్డుల విభజన పత్రాలను ఎంపీపీ కలగా లక్ష్మి పంపిణీ చేశారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఇంకా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు. మండల ప్రత్యేక అధికారి రోజారాణి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల పత్రాలను అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతలగుంటపాలెంలో 587, తాళ్లపాలెంలో 443 వంతున వివిధ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, వైఎస్ ఎంపీపీ నమ్మి మీనా, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, నాగయమ్మ, కలిగెట్ల నూకరత్నం, ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి భవాని, అద్దంకి సతీష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు వైఎస్సార్ యంత్ర సేవ యాప్‌ను వినియోగించుకోవాలి


రైతులకు వైఎస్సార్ యంత్ర సేవ యాప్‌పై అవగాహన కలిగిస్తున్న మోహన్‌రావు


రైతు భరోసా కేంద్ర భవనాన్ని పరిశీలిస్తున్న మోహనరావు

కశింకోట : రైతులు తమ పంట భూముల సాగుకు కావలసిన ట్రాక్టర్లు, ఇతర యంత్ర పరికరాలు అద్దె ప్రాతిపదికన పొందేందుకు వైఎస్సార్ యంత్ర సేవ యాప్‌ను వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహనరావు తెలిపారు. మండలంలోని వెదురుపర్తి గ్రామంలో వైఎస్సార్ యంత్ర సేవ యాప్‌పై రైతులకు అవగాహన కలిగించారు. ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్లకు రాయితీపై ఇచ్చిన ట్రాక్టర్, ఇతర యంత్ర పరికరాలను అద్దె ప్రాతిపదికన కావలసిన రైతులకు సమకూరుస్తారన్నారు. ఇందుకు సంబంధిత రైతు భరోసా కేంద్రంలో గాని, సెల్‌ఫోన్‌లో గాని డౌన్‌లోడ్ చేసుకున్న వైఎస్సార్ యంత్ర సేవా యాప్ యద్వారా తమ ఇంటి నుంచి నిర్ణీత రుసుంపై అద్దెకు యంత్ర పరికరాలు బుక్ చేసుకోవచ్చునన్నారు. మండలంలో ఎక్కడ భూమి ఉన్నా ఈ అవకాశాన్ని రైతులు పొందవచ్చునన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణాన్ని పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏవో స్వప్న, వీఏఏ సింధూజ, రైతులు పాల్గొన్నారు.

9న బీసీ సంఘాల నేతలతో సమావేశం


రాష్ట్ర కమిటీ ఇన్‌చార్జిగా నియామక పత్రం అందుకుంటున్న ఆడారి కుమారస్వామి

తుమ్మపాల : రాష్ట్రంలో అన్ని బీసీ సంఘాల ముఖ్య నేతలతో ఈ నెల 9న పట్టణంలోని విజయ రెసిడెన్సీలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలిండియా బీసీ అసోషియేషన్ జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సంఘాల నాయకులు, ఉద్యమకర్తలు, కుల సంఘాల నాయకులు, మేధావులతో జరిగే సమావేశంలో బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బీసీ అసోషియేషన్ రాష్ట్ర కమిటీ ఏర్పాటులో భాగంగా రాష్ట్ర ఇన్‌చార్జిగా ఆడారి కుమారస్వామిని నియమించామన్నారు. బీసీలతో సత్సంబంధాలు కలిగిన నాయకుల పనితీరు ఆధారంగా త్వరలో అధ్యక్షుడిని ఎంపిక చేస్తామన్నారు.

నడక, వ్యాయామంతో వ్యాధులు దూరం


క్లబ్ ఆవరణలో మొక్కలు నాటుతున్న సభ్యులు

అనకాపల్లిటౌన్ : నడక, వ్యాయామంతో వ్యాధులు దూరమవుతాయని వైద్యుడు జీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో బుధవారం సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వారంలో ఒకరోజు ఉపవాసం ఉన్నా ఆరోగ్యానికి ఉపకరిస్తుందని పేర్కొన్నారు. అంతకు ముందు అసోసియేషన్ సభ్యుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. క్లబ్ సభ్యుడు పాము వెంకటరమణ అసోసియేషన్‌కు తనవంతు విరాళంగా రూ.10 వేలు అందజేశారు. సభ్యులు క్లబ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సభ్యులు కేవీ గౌరీపతి, పి.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు ఉచిత రేబిస్ నివారణ టీకాలు నేడు

అనకాపల్లి రూరల్ : ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని గురువారం స్థానిక గాంధీనగరం ప్రాంతీయ పశువుల ఆసుపత్రిలో పెంపుడు కుక్కలకు రేబీస్ నివారణ టీకాలు ఉచితంగా వేయనున్నట్టు పశుసంవర్ధక శాఖ ఏడీ బి. సౌజన్య తెలిపారు. జంతువుల ద్వారా రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, లాప్టోస్పైరిస్ లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా మనుషులకు రేబిస్ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుందన్నారు. టీకా ద్వారా దీనిని అదుపులో పెట్టవచ్చన్నారు. స్థానిక గాంధీనగరం ఏరియా పశు వైద్యశాలతో పాటు జిల్లాలో ఉన్న పశు వైద్యశాలల్లో కూడా జూనోసిస్ డేను పురస్కరించుకుని గురువారం కుక్కలకు ఉచితంగా రేబిస్ నివారణ టీకాలు వేస్తున్నందున అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సమస్యల పరిష్కారం కోరుతూ విద్యార్థుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : స్థానిక గాంధీనగరం ప్రభుత్వ హైస్కూల్ సమస్యల పట్ల విద్యార్థులు పీడీఎస్‌వో ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ మండలంలో గుండాల కూడలి వరకు సాగింది. అక్కడ మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.జానకీరాం, డి.జగదీష్, ఎ.ఉదయ్‌కిరణ్, 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

డస్ట్ అలవెన్స్ పెంచాలని ధర్నా


ఎన్టీపీసీ ఎదుట ధర్నాకు దిగిన కాంట్రాక్టు కార్మికులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు డస్ట్ అలవెన్స్ పెంచుతూ వెంటనే అగ్రిమెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఎన్టీపీసీ ప్రధాన గేటు ముందు ధర్నా నిర్వహించారు. ధర్నాలో గనిశెట్టి మాట్లాడుతూ డస్ట్ అలవెన్స్ ఏళ్ల తరబడి పెంచకపోవడం దుర్మార్గమన్నారు. మెడికల్ టెస్టుల పేరుతో కార్మికులను వేదింపులకు గురిచేయడం, నిలిపివేయడం అన్యాయమన్నారు. కార్మికులకు మంజూరు చేసే ఐడీ కార్డులో ఎన్టీపీసీ లోగోను తొలగించడం కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం చులకన చేయడమేనన్నారు. తక్షణమే కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని గనిశెట్టి హెచ్చరించారు.